మురుగుకు అడ్డుకట్ట వేయండి

బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లోకి వస్తున్న మొయిని చెరువు మురుగుకు అడ్డుకట్ట వేయాలని కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి ఉస్మానియా యూనివర్శిటీ అధికారులకు చెప్పారు. చెరువు నుంచి వస్తున్న మురుగు మల్లికార్జుననగర్ బస్తీలో చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోగా గురువారం ఉస్మానియా యూనివర్శిటీ అధికారులను పిలిపించి, సమస్యను వెంటనే పరిష్కరించాని చెప్పారు.

- అంబర్‌పేట

సాచురేషన్ పద్ధతి అమలు చేయాలి

కాచిగూడ, డిసెంబర్ 5 : కేంద్ర ప్రభుత్వం బీసీలకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ పథకంలో సాచురేషన్ పద్ధతిని అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు 80 శాతం ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేయాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో రూ.90 వేల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు విధించిన షరతులను ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్

శబరిమల అయ్యప్ప దర్శనం..

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. బుధవారం నగరం నుంచి ఇరుముడితో బయలుదేరిన ఎమ్మెల్యే గురువారం శబరి కొండకు చేరుకొని ఉదయం అయ్యప్పను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట శేఖర్‌రెడ్డి గురుస్వామి, దిలీప్ స్వామి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

- అంబర్‌పేట

వీడీసీసీ రోడ్ల నిర్మాణం

లంగర్‌హౌస్ డివిజన్ బాపూనగర్, హాశంనగర్‌లో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్కిల్ -13 ఇంజినీరింగ్ అధికారులు ప్రారంభించారు. పనులను ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జ మాసిద్ధిఖీ, ఏఈ ఫరీదుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేస్తామని ఏఈ తెలిపారు.

- మెహిదీపట్నం

రోడ్లకు మరమ్మతులు

వాహనదారులకు ఇబ్బందులు కలుగకుంగాసిబ్బంది రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. గుంతలను పూడ్చేందుకు సర్కిల్ -12 అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మెహిదీపట్నం డివిజన్‌లో బీటీ రోడ్ల గుంతలకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామని ఈఈ లాల్‌సింగ్ తెలిపారు.

- మెహిదీపట్నం

శ్రీనివాసరాజును ఆదుకోవాలి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతి పత్రం సమర్పించిన ఆదిల్ షరీఫ్

అబిడ్స్, డిసెంబర్ 5 : జీహెచ్‌ఎంసీ ఎల్‌బీ నగర్ సర్కిల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు ప్రమాదానికి గురై దవాఖానలో చికిత్స పొందుతున్నారని, అతనికి మరింత ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ.. ప్రమాదానికి గురైన అతనికి ఇప్పటికే మూడు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పూర్తయ్యిందని, దవాఖానలో ప్రతి నిత్యం వైద్య ఖర్చులు అవుతున్నాయని, వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. అతనికి అదనంగా డబ్బులు విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరారు.

హరీశ్‌రావు అక్రమ అరెస్ట్‌పై.. బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

అబిడ్స్, డిసెంబర్ 5 : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డిలను అరెస్ట్ చేయడంపై గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఇష్టం లేక పోతే హరీశ్‌రావును అరెస్ట్ చేయడం తగదన్నారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో తెలంగాణను రావణ కాష్ఠం చేస్తున్న ఏడాది కాలం ప్రజలకు చేసిందేమి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు చేసి నిర్బంధాలతో పాలన కొనసాగించాలనుకుంటే అది వారి భ్రమ మాత్రమేనని, ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింత మంది పుట్టుకొస్తారన్నారు. ప్రభుత్వాలు ఎప్పటికీ శాశ్వతం కాదని వారి ఆటలో పోలీసులు కీలు బొమ్మలు కావద్దని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

అయ్యప్పస్వామి పడిపూజ

సంఘ సేవకుడు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజ కార్యక్రమంతో ప్రారంభమై మహాపడిపూజ కార్యక్రమంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలేరు రాజు, వెంకులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

- కాచిగూడ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో బేగంపేట టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు

అంబర్‌పేట, డిసెంబర్ 5 : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ సీపీ సి.వి.ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం డీడీ కాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ' రోడ్డు ప్రమాదాలు.. నివారణ' పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏసీపీ మాట్లాడుతూ.. ఎక్కువగా యువత ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలు శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వెనుక వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ వి.రాచందర్ మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే ఆరు నెలల వరకు జైలుశిక్ష లేదా రూ.1000 జరిమానా.. రెండూ విధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ రచన, పునీత్, సిబ్బంది, ట్రాఫిక్ ఎస్సై వీర మల్లయ్య, అయాన్, కృష్ణ, హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్‌వైజర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అబిడ్స్, డిసెంబర్ 5 : అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు నాణ్యతతో చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆదేశించారు. గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.23 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన పనులను ఎమ్మెల్యే కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాశ్ భీష్వతో కలిసి ప్రారంభించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే అధికారులు పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఏ విధమైన సమస్యలున్నా తన దృష్టికి తీసుకు వస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ నిచ్చారు. అంతకు ముందు రూ.12 లక్షల వ్యయంతో బొగ్గులకుంట కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు, మహేశ్ నగర్ కాలనీలో రూ.7.68 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వీడీసీసీ రోడ్డు పనులు, రూ.1.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ఓం ప్రకాశ్ భీష్వ, రమేశ్, జ్ఞానేశ్వర్, వివేక్, రాకేశ్, సుదర్శన్, శ్యాంరావు, మల్లేశ్, శైలేందర్, అజయ్ తుల్సన్, మహేందర్, సురేశ్, నితిన్ జైస్వాల్, గణేశ్, రాజేశ్, కిశోర్, విజయ్‌సింగ్, డేవిడ్, శ్యాం యాదవ్, రతన్‌కుమార్, శ్రవణ్ కుమార్, మోహిత్ దత్త, దేవి దివాకర్, మనోజ్, సత్యనారాయణ, తరుణ్, వేణుయాదవ్, ఖదీర్, కావ్య, అరుణ, రాజలక్ష్మి, పద్మ, మౌనిక, రేఖ, సావిత్రి పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రి డివిజన్‌లో అభివృద్ధి పనులను కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాశ్ భీష్వతో కలిసి ప్రారంభిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

సదుపాయాలు కల్పించాలి

ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి జీహెచ్‌ఎంసీ, జలమండలి,విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహిను ద్దీన్ అన్నారు. గురువారం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. మహిళలు తాగునీరు, రోడ్ల స్థితిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- మెహిదీపట్నం

స్వచ్ఛంద దినోత్సవం.. కార్మికులకు సన్మానం

స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. గురువారం గోల్నాకలో సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, నర్సయ్య, ఏఎంహెచ్‌వో హేమలత, హైకోర్టు న్యాయవాది జీఎల్ నర్సింహా హాజరై.. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, ప్రవీణ్, కిశోర్, పాండురంగం, టింకు పాల్గొన్నారు.

- గోల్నాక



ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటామని ఎంఐఎం శాసనసభా పక్షనేత చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఫతేదర్వాజలో మృతి చెందిన సీనియర్ కార్యకర్త మిర్జా రఫతుల్లా బేగ్ కుటుంబసభ్యులను గురువారం ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మెహిదీపట్నం ఎంఐఎం వార్డు కమిటీ సభ్యులు సమీఉల్లా బేగ్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

రైలెక్కుతూ.. వాచ్‌మెన్ మృతి

కాచిగూడ, డిసెంబర్ 5 : ఎంఎంటీఎస్ రైలెక్కుతూ.. ప్రమాదవశాత్తు వాచ్‌మెన్ మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన నారాయణ కుమారుడు సాయిబాబా (64) సెయింట్ మేరీ స్కూల్లో వాచ్‌మెన్. బుధవారం రాత్రి ఉప్పుగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం - 1లో ఫలక్‌నుమా - లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసు లు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్‌ఫాంపై వ్యక్తి ..

ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) గురువారం సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం - 3 లో అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, కాకి ప్యాంట్ ఉన్నదని, ఎత్తు 5.2 ఉన్నట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 87125 68495లో సంప్రదించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి లింగంపల్లి ఎక్స్‌రోడ్ సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు తాగుడుకు బానిసై విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని, కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకొని నడపాలని సూచించారు.

పేదలకు అండగా ఉంటా..

- 'డబుల్' లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే ముఠా గోపాల్
- పాల్గొన్న మంత్రులు, కలెక్టర్

చిక్కడపల్లి, డిసెంబర్ 5 : ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ లాల్‌బహదూర్ నగర్ బస్తీకి చెందిన 37మంది డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గంలోని పేదలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచ నశ్రీ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



హరినగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్ తదితరులు

హరినగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

ముషీరాబాద్ : రాంనగర్ డివిజన్ హరినగర్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురవారం పర్యటించారు. స్థానికంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల కారణంగా తాగునీరు లీకేజీ అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే జలమండలి, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి హరినగర్‌లో పర్యటించారు. డ్రైనేజీ, తాగునీటి లీకేజీ సమస్యలను పరిష్కరించిన తర్వాతే రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ మురళి పాల్గొన్నారు.

7న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

- ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ పిలుపు

సికింద్రాబాద్, డిసెంబర్ 5: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 7న చేపట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని డ్రైవర్ల సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. చలో హైదరాబాద్‌కు వేలాదిగా తరలిరావాలని తెలంగాణ సంఘం జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు రాష్ట్ర బంద్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. తమ సమస్యలు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోమీటర్ చార్జీలు పెంచి, ఇతర జిల్లాల ఆటోలు హైదరాబాద్ నగరంలోకి రాకుండా నిషేధించాలన్నారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. అదేవిధంగా ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి మరిచిపోయారని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ఫ్రీ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు జీవనోపాధి దెబ్బతిన్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా మంత్రి ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి 12 నెలలు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం నాయకులు ఎండీ ఉమర్ ఖాన్, కే. బాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డ్రైవర్ల సంఘం నాయకుడు ఎండీ ఉమర్‌ఖాన్ తదితరులు

భారత్‌లోనే అధికంగా సేంద్రియ వనరులు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 5 : ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ పరిధిలోని రాజేంద్రనగర్ కళాశాలలో గురువారం అసోసియేట్ డీన్ పి. ప్రశాంత్ మాట్లాడుతూ.. జీవకోటి మనుగడకు నేల పరిరక్షణ అవసరమన్నారు. భూమి పరిరక్షణతోనే నీరు, గాలి స్వచ్ఛంగా ఉంటుందన్నారు. ఇప్పటికీ భారత్‌లోనే సేంద్రియ వనరులు అధికంగా ఉన్నాయన్నారు. విశాలమైన అటవీ ప్రాంతం, ఎర్ర, ఇసుక , నల్ల నేలలు వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రధానంగా ఉద్యాన పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్లాస్టిక్, పొల్యూషన్ నివారిస్తూ అధిక పంటలు పండించవచ్చన్నారు. అడవులను కాపాడడం వల్ల నేల కోతకు గురికాదని, వర్షాకాలంలో అడవుల నుంచి చెరువు, కుంటలకు చేరే నీటిలో సేంద్రియ పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. డా. కళాధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేల పరిరక్షణపై అవగాహన కల్పించారు. థాయిలాండ్ హెచ్‌ఎం రాజు భూమిబోల్ అదుల్యాదేజ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రపంచ నేల దినోత్సవంగా ప్రతి ఏడాది జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి సంతోషిణి, లావణ్య, నిరోష, మమత, శ్రీనివాస్, శ్రీరాములు , బోధన , బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

నాగేశ్వర్‌రావుకు జీవన సాఫల్య పురస్కారం

ముషీరాబాద్, డిసెంబర్ 5: భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో గురువారం ఘంటసాల వెంకటేశ్వర్‌రావు జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు ముఖ్య అతిథిగా పాల్గొని గాయకుడు పేరి నాగేశ్వర్‌రావుకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ.. ఘంటసాల పాటల అనుకరణలో పేరి నాగేశ్వర్‌రావు మేటి అని కొనియాడారు. కార్యక్రమంలో కేవీ రమణారావు, ప్రసన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారవంతమైన నేలలోనే అధిక దిగుబడులు

శంషాబాద్ రూరల్: సారవంతమైన నేలలోనే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి శ్వేత తెలిపారు. గురువారం రైతు వేదికలో నేల దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు వారి భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. వరి, మొక్కజొన్న పంటలతో పాటు పామాయిల్ పంట సాగు చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సబ్సిడీలు వ్యవసాయశాఖ నుంచి అందిస్తామని వివరించారు. విస్తారణ అధికారి సురేష్‌రెడ్డి, రైతులు కొత్తనవీన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి రైతులు పాల్గొన్నారు.